సాక్షి తిరుపతి

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



భక్తులకు రక్షణే లక్ష్యం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వందశాతం కండిషన్ ఉన్న బస్సులనే నడపాలని, ఎంపిక చేసిన బస్సులను ఆ సంస్థ తనిఖీలు చేస్తోంది. - 8లో



తిరుచ్చిపై వెంకన్న విహారం

చంద్రగిరి : కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవేరులతో తిరుచ్చి పై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.



పెరటాసి.. భక్తసిరి

పెరటాసి నెల తొలి శనివారం రోజున భక్తులు అలిపిరిలో పూజలు చేసి, తిరుమలకు కాలి నడకన వెళ్లారు. - 8లో

న్యూస్‌రీల్

అంబులెన్స్ ప్రారంభం



జెండా ఊపి అంబులెన్స్ ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో మనో బంధు ఫౌండేషన్ అంబులెన్స్ సేవలను ఎస్పీ సుబ్బరాయుడు శనివారం ప్రారంభించారు. మతిస్థిమితం లేని వారిని మానసిక వైద్యశాలలకు తరలించి, బాగు చేయించడమే లక్ష్యంగా మనో బంధు ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. మతిస్థిమితం లేకుండా రోడ్ల పైన ఎవరైనా కనిపిస్తే 92465 63738, 98668 87299 నంబర్లకుకు సమాచారమివ్వాలన్నారు. మనోబంధు ఫౌండేషన్ ఈ సేవలను రెండు తెలుగు రాష్ట్రాల్లో అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న ఆ సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణంరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి అండర్-14 జూడో పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్-14 జూడో పోటీలు ఆదివారం ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు ఎస్.బాబు, జె.వసంతవాణి, ఎం.వసంత ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీలకు అన్ని జిల్లాల నుంచి సుమారు 300 మందికిపైగా బాలబాలికలు హాజరవుతారని వారు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 73,104 మంది స్వామివారిని దర్శించుకోగా 28,330 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.25 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

3న సీల్డ్ టెండర్ల ఆహ్వానం

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్నుల రేటు కాంట్రాక్టు కింద సీల్డ్ టెండర్లను టీటీడీ ఆహ్వానిస్తోంది. టీటీడీ వినియోగించిన ఖాళీటిన్లు 2025 మార్చి వరకు సేకరించవచ్చు. తిరుపతిలోని హరేకృష్ణ రోడ్డులోని మార్కెటింగ్(వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు అక్టోబరు 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయాలి. ఇతర వివరాలకు మార్కెటింగ్(వేలం) కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో సంప్రదించాలని టీటీడీ అధికారులు కోరారు.

ప్రాక్టికిల్స్

తరగతి గదులే శాస్త్ర పరిశోధనలకు వేదిక కావాలి.. ఇదీ ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్ష.. అలాగే విద్యార్థులు పాఠ్యాంశాలను వందశాతం అర్థం చేసుకోవాలన్నా ప్రయోగాలు తప్పనిసరి.. ఇందుకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే వీటిని చేయాలి. అయితే ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు ప్రయోగాలను అటకెక్కిస్తున్నాయి. ప్రాక్టికల్స్‌ను కిల్ చేస్తూ..ఆ పీరియడ్లనూ థియరీకి వినియోగిస్తున్నాయి. తనిఖీలు చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఫలితంగా విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పడిపోతున్నాయి.





తిరుపతిలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ప్రయోగ తరగతులను పరిశీలిస్తున్న ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి



చోద్యం చూస్తున్న అధికారులు

ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్, తరగతులు, పరీక్షలు నిర్వహణపై తనిఖీలు నామమాత్రంగా ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ అధికారంలో ఉండడంతో ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల ఆగడాలను చోద్యం చూడడం తప్ప చర్యలు తీసుకునే వెసులుబాటు అధికారులకు లేకపోవడంతో వీరు అడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా మారింది. ప్రాక్టికల్స్ పరీక్షల సమయంలో ఒక్కో విద్యార్థి వద్ద రూ.300 నుంచి రూ.400 వరకు వసూలు చేస్తూ, ఆ సొమ్మును ప్రాక్టికల్స్ జరిగే కేంద్రాల్లో విధులు నిర్వహించేందుకు వచ్చిన ఎగ్జామినర్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లకు ముడుపులుగా ఇస్తున్నట్లు ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్, ఇతర ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈ తరహాలోనే వ్యవహరిస్తుంటాయనేది బహిరంగంగా వినిపిస్తున్న విమర్శ.

తిరుపతి ఎడ్యుకేషన్: గత ప్రభుత్వ హయాంలో అన్ని ప్రభుత్వ యాజమాన్యాలతో పాటు ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో తరగతులు నిర్వహించేవారు. ప్రాక్టికల్స్‌కు కేటాయించిన పీరియడ్లలో ల్యాబ్‌ల్లో విద్యార్థులతో తప్పనిసరిగా ప్రయోగాలు చేయించేవారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థ క్రమంగా నిర్వీర్యం అవుతూ వస్తోంది. ప్రైవేటు, కార్పొరేట్‌కు అనుకూలమనే విమర్శలను గతంలోనే టీడీపీ ప్రభుత్వం మూటగట్టుకుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆ దిశగానే అడుగులు వేస్తూ ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా మంత్రి నారాయణకు చెందిన కళాశాలలు ఉండడంతో విద్యా విధానాలను కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాల ఇష్టారాజ్యానికి వదిలేశారు. సీఎం తనయుడు లోకేష్ మంత్రిగా ఉన్న విద్యాశాఖ ప్రకటించిన అకడమిక్ క్యాలెండర్‌కే ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు తూట్లు పొడిచాయంటే ఆ శాఖ పనితీరు ఇట్టే అవగతమవుతుంది.

నిబంధనలకు పాతర

జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఇంటర్ బోర్డు నిబంధనలకు పాతరేసి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. రాష్ట్ర ఇంటర్ బోర్డు విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యార్థులకు బోధించాల్సిన పాఠ్యాంశాలు, సిలబస్, ప్రాక్టికల్స్‌ను పక్కనబెట్టాయి. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అడ్డదారుల్లో మార్కులు, ర్యాంకులు తెచ్చుకునే వెసులుబాటుకు అలవాటు పడిన ప్రైవేటు యాజమాన్యాలు ప్రాక్టికల్స్ పీరియడ్స్‌ను పక్కనబెట్టేశాయి. కళాశాలలు ప్రారంభమై 3 నెలలు దాటినా ఈ రోజుకీ ఒక్క ప్రయోగం నిర్వహించకపోవడం ఉదాసీనతకు నిదర్శనం.



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రాక్టికల్స్ పీరియడ్లకు సెలవు

ఇంటర్ బోర్డు అకడమిక్ క్యాలెండర్‌లో ప్రథమ, ద్వితీయ సంవత్సర ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌కు పీరియడ్లు కేటాయించారు. ఇందులో భాగంగా ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి నెలకు 16 పీరియడ్లు, బైపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజీ సబ్జెక్టుల్లో 32 పీరియడ్లు కేటాయించి విద్యార్థులతో ప్రయోగాలు నిర్వహించాలి. ప్రభుత్వ యాజమాన్య కళాశాలల్లో ప్రయోగాలను కొంత మేర నిర్వహిస్తున్నారు. అయితే ప్రైవేటు, కార్పొరేట్‌లో ప్రయోగాలకు ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ ప్రయోగాలను పక్కన పెట్టేసి, ఆ పీరియడ్లను థియరీకి వినియోగిస్తున్నారు. అసలు ప్రయోగాలు ఉన్నాయన్న విషయమే విద్యార్థులకు తెలియకపోవడం కొసమెరుపు.

అటకెక్కిన రసాయనాలు, పరికరాలు

జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 68, ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్య కళాశాలలు 119, మొత్తం 187జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో ప్రథమ సంవత్సర ఎంపీసీ విద్యార్థులు 18,671 మంది, బైపీసీలో 7,946 మంది, ద్వితీయ సంవత్స ఎంపీసీలో 16,986 మంది, బైపీసీలో 6,937 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రథమ సంవత్సరం నుంచే ప్రాక్టికల్స్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఆ ఊసే లేకపోవడంతో వారికి ప్రాక్టికల్స్ అంటే తెలియని పరిస్థితి ఉంది. కొన్ని కళాశాలల్లో మాత్రం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు 15 రోజుల ముందు హడావుడిగా ప్రాక్టికల్స్ నిర్వహించి, మమ అనిపించేస్తున్నారు. బోర్డు నిబంధనల మేరకు ప్రతి కళాశాలలో ఒక్కో సబ్జెక్టుకు సంబంధించి రెండు క్లాసులు ప్రాక్టికల్స్‌కు వినియోగించాల్సి ఉన్నప్పటికీ వీటికి ప్రైవేటు కళాశాలల యాజమాన్యం స్వస్తి పలకడంతో ప్రయోగాలకు వాడాల్సిన రసాయనాలు, పరికరాలు అటకెక్కాయి. ల్యాబ్‌కు తాళాలు పడడంతో బూజు పట్టాయి. కొన్ని కళాశాలల్లో అసలు ల్యాబ్‌లు, రసాయనాలు లేకపోవడం గమనార్హం.

తనిఖీలు చేసి.. చర్యలు తీసుకుంటాం

"ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో అకడమిక్ క్యాలెండర్ మేరకు తప్పనిసరిగా ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించాలి. దీనిపై జిల్లాలోని అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలలకు ఆదేశాలు జారీ చేశాం. ప్రాక్టికల్స్ తరగతుల నిర్వహణపై తనిఖీలు చేస్తాం. ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించని ఆయా జూనియర్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడం.

– జీవీ.ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఐఓ, తిరుపతి

పంట నష్టం.. అంచనాకు నెల

- ప్రతిపాదనలు ఎప్పుడో?
- ఆ తర్వాత పరిహారం చెల్లింపునకు ఎంతకాలమో?

తిరుపతి అర్బన్: ఆగస్టులో కురిసిన వర్షాలతో జిల్లాలో వరి పంటకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా దొరవారిసత్రం, తడ, రేణిగుంట, వడమాలపేట మండలాల్లోని 74 మంది రైతులకు సంబంధించి 53.35 హెక్టార్ల వరి పంట దెబ్బతింది. ఆ రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాల్సి ఉంది. అయితే నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు పంట నష్టాన్ని మాత్రమే వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. పరిహారం కోసం ప్రతిపాదనలు పంపడానికి ఎంత సమయం తీసుకుంటారో తెలియడంలేదు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ఇవ్వడానికి ఎంతకాలం పడుతుందోనని అంతా చర్చించుకుంటున్నారు. గత సర్కార్‌లో పంట నష్టం జరిగిన నెల రోజుల వ్యవధిలోనే అన్నదాతలకు పంట నష్టపరిహారం ఇచ్చేవారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రైతులను పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. వ్యవసాయశాఖలో ఏ పని చేయాలన్నా అధికారులు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందలేదంటూ వాయిదాలు వేస్తున్నారు. దీంతో రైతులకు ఆందోళన తప్పడంలేదు.

24 నుంచి స్కూల్‌గేమ్స్ అండర్-19 ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో అండర్-19 ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జట్లు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు తిరుపతి ఎస్వీ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో హాకీ, బ్యాడ్మింటన్, 25వ తేదీ ఉదయం 10గంటలకు ఎమ్మార్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో త్రైక్వాండో, 26వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ఎస్వీ క్యాంపస్ స్కూల్ ఆవరణలో వాలీబాల్ పోటీలు ఉంటాయి. 27వ తేదీ ఉదయం 10గంటలకు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో స్విమ్మింగ్, జూడో, రెజ్లింగ్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టెన్నిస్, మధ్యాహ్నం 2గంటలకు తుమ్మలగుంట తుడా మైదానంలో అథ్లెటిక్స్, 28వ తేదీ ఉదయం 10గంటలకు లింగేశ్వరనగర్‌లో కరాటే, మధ్యాహ్నం 2గంటలకు చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. 29వ తేదీ ఉదయం 8 గంటలకు మదనపల్లె బీటీ కళాశాల ఆవరణలో బాస్కెట్ బాల్, నెట్ బాల్, ఉదయం 10 గంటలకు గయారాంపల్లి ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ఆవరణలో రగ్బీ, టెన్నికాయిట్, హ్యాండ్ బాల్, త్రో బాల్, 30వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రైఫిల్ షూటింగ్ నిర్వహిస్తారు. అదే రోజు ఉదయం 10గంటలకు తిరుపతి కరకంబాడి రోడ్డులోని ఆర్చరీ అకాడమీలో ఆర్చరీ పోటీలు ఉంటాయి. అక్టోబరు 1వ తేదీ ఉదయం 10గంటలకు రేణిగుంట బాలికల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో బాల్ బ్యాడ్మింటన్, సెపక్‌తక్ర క్రీడల్లో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు 01.01.2006తరువాత జన్మించి, ప్రస్తుతం ఇంటర్ చదివే వారు అర్హులని, ఆయా ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు పదో తరగతి మార్కుల లిస్ట్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని జయరామయ్య తెలిపారు.

చెరువులు..దొరువులు.. కాలువలు ఇలా ఒకటేంటి..అన్నీ కబ్జారాయుళ్ల చేతిలో చిక్కుకున్నాయి. ఖరీదైన భూమిపై కన్నేసి.. ఆక్రమించి, కట్టడాలు నిర్మించారు. ఆపై విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. భూదందా జరుగుతున్నా.. ఈ విషయంపై కలెక్టర్ హెచ్చరించినా.. అధికార యంత్రాంగం నిద్రమత్తులో జోగుతోంది. ఫలితంగా అక్రమార్కులు రూ.కోట్ల విలువైన కాలువ భూమిలో వేసిన షెడ్లకు రక్షణగా ప్రహరీ నిర్మిస్తున్నారు. ఈ అక్రమాల ఘనత తిరుపతి రూరల్ మండలం పేరూరులో చోటు చేసుకుంది.



పేరూరులో కాలువను ధ్వంసం చేసి అక్రమంగా నిర్మించిన షెడ్లు

కాలువ భూమికి ఎసరు..

భద్రత అత్తెసరు

కలెక్టర్ చెప్పినా లెక్కలేదు..!

- కబ్జారాయుళ్లకు రెవెన్యూ అండ
- పేరూరులో యథేచ్ఛగా కాలువ కబ్జా
- రూ.2 కోట్ల విలువైన కాలువ ఆక్రమణ
- ఐదు షెడ్లు నిర్మాణం
- కబ్జాలకు రక్షణగా ప్రహరీ నిర్మాణం ప్రారంభం
- అడ్డుకున్న స్థానికులపై కేసులు పెట్టి వేధింపులు

తిరుపతి రూరల్: మండలంలో అధికార పార్టీ అండతో కబ్జారాయుళ్లు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న భూబకాసురులు తాజాగా కాలువలు, చెరువులపై పడ్డారు. తిరుపతి రూరల్ మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది అండతో ఆరు ప్లాట్లు...పదహారు ఇళ్లుగా విజృంభిస్తున్నారు. కబ్జాలపై కలెక్టర్ కన్నెర్ర చేసి, అడ్డుకోవాలని ఆదేశాలు ఇచ్చినా, రూరల్ మండల రెవెన్యూ అధికారులు మాత్రం రాజకీయ ఒత్తిళ్లతో కబ్జాల వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేరూరు పంచాయతీలో కాలువను ధ్వంసం చేసి, అనధికర లేఅవుట్ వేసి మరీ నిర్మాణాలు చేపట్టడమే.. ఇందుకు నిదర్శనం.

అడ్డుకున్న స్థానికులపై పోలీసు కేసు

ఇటీవల కబ్జాలను స్థానికులు అడ్డుకున్నారు. కబ్జారాయుళ్లు వారిని బెదిరించారు. కబ్జారాయుళ్లు ఎంతకు బరితెగించారంటే...కాలువను ఆక్రమించుకోవడమే కాకుండా, తమ కబ్జాలకు అడ్డు వస్తున్నారని, తమను అడ్డుకుంటున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో ముందు వెనుక చూడకుండా పోలీసులు సైతం స్థానిక మహిళలపై కేసులు నమోదు చేశారు. కబ్జా చేసి కట్టిన ఇంటికి ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ మీటర్ ఇవ్వలేదు. అయితే బయట నుంచి తీసుకువచ్చిన మీటర్‌ను బిగిస్తే, దానిని స్థానికంగా ఉండే యువకులు దొంగిలించారని కబ్జారాయుళ్లు ఫిర్యాదు చేయడం, దానిపై పోలీసులు కేసు నమోదు చేయడం గమనార్హం. కాలువను ఆక్రమిస్తున్న కబ్జారాయుళ్లకు పోలీసులు, రెవెన్యూ అధికారులు తోడ్పాటుపై ఇప్పటికే స్థానికులు కలెక్టర్‌కు, ముఖ్యమంత్రికి, డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేశారు.

రూ.2 కోట్ల కాలువ ఆక్రమణ

పేరూరు పంచాయతీలో 'ఆటో' మూలాలు ఉన్న వ్యక్తి కబ్జాలకు రింగ్ మాస్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు వరకు వైఎస్సార్‌సీపీతో అంటకాగిన కొందరు తాజాగా టీడీపీ నేతలుగా అవతారం ఎత్తారు. ప్రజాబలం లేని రింగ్ మాస్టర్ పోకిరి బ్యాచ్‌ని చేరదీసి కబ్జాలకు ఉసిగొల్పుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అందులో భాగంగానే పేరూరు పంచాయతీలోనే సర్వే నంబర్ 460/2లో రూ.2 కోట్ల విలువైన 250 అంకణాలకు పైగా కాలువ స్థలాన్ని కబ్జా చేసి, అనధికారికంగా లేఅవుట్ వేస్తున్నారు. అందులో ఇప్పటికే ఐదు షెడ్డులు నిర్మించారు. స్థానిక సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, స్థానికులు ఈ కబ్జాలను అడ్డుకున్నారు. అయితే ఓ రెవెన్యూ అధికారి, ఇరిగేషన్ మండల అధికారి కాసుల మత్తులో కబ్జారాయుళ్లను ప్రోత్సాహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, స్థానికులు అడ్డుకున్నా రెవెన్యూ అధికారి అండతో యథేచ్ఛగా కాలువ భూమిలో ఐదు షెడ్డులు నిర్మించారు. ఒక్కొక్కటి రూ.20 లక్షల చొప్పున విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రహరీ నిర్మిస్తున్నారు

కబ్జారాయుళ్లు కాలువను కబ్జా చేసి నిర్మించిన అక్రమ షెడ్డులకు రక్షణ కోసం ప్రహరీని నిర్మిస్తున్నారు. అక్రమ కేసులతో ఇప్పటికే స్థానికులను భయపెట్టిన భూబకాసురులు పట్టపగలే భారీ ప్రహరీ నిర్మిస్తున్నా... రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అయినా స్పందించి కాలువ కబ్జాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కబ్జాలకు రక్షణగా నిర్మిస్తున్న ప్రహరీ గోడ

ఆక్రమణలు తొలగిస్తాం

"పేరూరు పంచాయతీలో కాలువ ఆక్రమణలను పరిశీలిస్తాం. ఆక్రమంగా నిర్మించిన షెడ్డులను తొలగిస్తాం. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– రామాంజనేయులు నాయక్, తహసీల్దార్, తిరుపతి రూరల్

తిరుపతిలో భారీ చోరీ..!

- మూడు ఇళ్లలో దొంగతనాలు
- 448 గ్రాముల బంగారం, 7.5 కిలోల వెండి, రూ.11 లక్షల నగదు అపహరణ
- ఉలిక్కిపడిన తిరునగరి
- దొంగల కోసం నాలుగు బృందాలతో వేట

తిరుపతి రూరల్: తిరునగరి ఉలిక్కిపడింది. వరుస చోరీలతో బిత్తరపోయింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒకటి తర్వాత ఒకటి చొప్పున మొత్తం మూడు ఇళ్లలో చోరీ జరిగింది. దాదాపు అర కిలో బంగారం, ఏడు కిలోలకు పైగా వెండి, రూ.11 లక్షల నగదు దొంగల పాలైంది. బాధితుల ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీసులు శనివారం సంఘటన స్థలానికి చేరుకున్నారు. తిరుపతి జిల్లా క్రైమ్ ఏఎస్పీ నాగభూషణం, చంద్రగిరి డీఎస్పీ బేతపూడి ప్రసాద్, రూరల్ సీఐ చిన్నగోవింద్ చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, ఫింగర్ ప్రింట్స్ నిపుణులు ఆధారాలు కోసం వెతికారు.

ఒక ఇంట్లోనే 420 గ్రాముల బంగారం, రూ.11 లక్షల నగదు

తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీ తిరుమలనగర్‌కు చెందిన నల్లారి నాగరాజ ఆచి మసాలా డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నారు. కింద నుంచి పైకి లగేజి మార్చుకుంటూ శుక్రవారం అర్ధరాత్రి వరకు బిజీగా ఉన్నారు. అర్ధరాత్రి తర్వాత పైపోర్షన్‌లో నిద్రించాడు. తెల్లవారుజామున మోటారు వేయడానికి కిందికి వచ్చాడు. కింద పోర్షన్‌లో డోర్ తెరిచి ఉండడం, బీరువా పగులగొట్టి బెడ్‌రూమ్‌లో ఉన్న 420 గ్రాములు బంగారు అభరణాలు, 800 గ్రాముల వెండి వస్తువులు, రూ.11 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఆ మేరకు బాధితుడు తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విజయవాడకు వెళితే..

పంచాయతీలోని టెలిఫోన్ కాలనీలో నివాసం ఉండే సురేష్ స్టీలు షాపు పెట్టుకుని వ్యాపారం చేస్తుంటాడు. కుటుంబంతో కలిసి విజయవాడకు వెళ్లాడు. ఇంట్లో ఎవరు లేనిది చూసి గుర్తుతెలియని దొంగలు తాళాలు పగలకొట్టి ఇంట్లోకి వెళ్లి ఆరు కిలోల వెండి వస్తువులను దోచుకెళ్లినట్లు బాధితుడు సురేష్ ఫిర్యాదు చేశారు.



చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారి

తలుపులు పగలకొట్టి మరీ..

పంచాయతీలోని టీటీడీ విశ్రాంత ఉద్యోగి వెంకటరమణ కుటుంబంతో కలిసి బయటకు వెళ్లారు. తాళం వేసిన ఇంటి తలుపులను పగలకొట్టి ఇంట్లోని 25 గ్రాముల బంగారు అభరణాలను దొంగలు దోచుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకేరోజు మూడు ఇళ్లలో చోరీలు జరగడం, భారీగా బంగారు, వెండి, నగదును దోచుకెళ్లిన ఘటనలపై తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సీరియస్ అయ్యారు. వీలైనంత త్వరగా దొంగలను పట్టుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో క్రైమ్ ఏఎస్పీ నాగభూషణం పర్యవేక్షణలో దొంగల వేట కోసం నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

అది గుంట పొరంబోకు స్థలం. రూ.కోట్ల విలువ చేస్తుంది. దివంగత మాజీ మునసబు ఎప్పుడో అక్రమంగా పొందిన పట్టాదారు పాసు పుస్తకం చూపి, ఆయన వారసులు ఆ గుంట స్థలాన్ని ప్లాట్లు వేసి, విక్రయించడానికి సిద్ధం చేశారు. అయితే అది ప్రభుత్వ భూమిగా గుర్తించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తే మాకేంటి? అన్నట్లు మాజీ మునసబు వారసులు పచ్చనేతలతో చేతులు కలిపి.. తమ పని తాము చేసుకుపోతున్నారు.


ప్రభుత్వ భూమిని నిర్ధారిస్తూ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు (ఫైల్)

హెచ్చరిక.. కబ్జాదారుకోలెక్కా!

- ప్రభుత్వ స్థలంలో ప్లాట్లు
- విక్రయానికి యత్నాలు
- గుంట స్థలానికే ఎసరు

నాయుడుపేటటౌన్: నాయుడుపేట ప్రాంతంలో పలు చోట్ల రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను నేతలు దర్జాగా అక్రమించుకుని వాటిని రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మార్చేసి విక్రయాలకు రంగం సిద్ధం చేస్తున్నారు. పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న లక్కిశెట్టిగుంట ఉంది. ఇది ప్రభుత్వ భూమి. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాయుడుపేట రెవెన్యూ శాఖలో పని చేసిన ఓ దివంగత మాజీ మునసబు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తిగా చూపుతూ అప్పట్లో సర్వే నంబర్ 81–3లో 0.62 సెంట్లు లక్కిశెట్టి గుంట ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా అసైన్‌మెంట్ పట్టా పొందారు. అప్పట్లోనే రెవెన్యూ అధికారులను లోబరుచుకుని పాస్ పుస్తకాలు సైతం చేసుకున్నారు. జాతీయ రహదారి వద్ద భూమి అంకణం సుమారు రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షలకు పైగా పలుకుతోంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అధికారులు అది ప్రభుత్వ భూమిగా గుర్తించి, ఆక్రమణలకు అడ్డుకట్ట వేశారు. మున్సిపల్ కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి 2021 అక్టోబర్ 16 తేదీ ఆ భూమిలో హెచ్చరిక బోర్డు సైతం నాటించి, స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం లక్కిశెట్టిగుంట భూమిపై కూటమి నేతల కన్ను పండింది. అసైన్‌మెంట్ పట్టా పొందిన దివంగత మాజీ మునసబు కుటుంబ సభ్యులు కూడా టీడీపీకి చెందిన వారు కావడంతో ఆ పార్టీ నేతలతో చేతలు కలిపి రూ.కోట్లు విలువ చేసే లక్కిశెట్టి గుంట ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు తొలగించి రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మార్చేసి విక్రయించడానికి సిద్ధం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక దృష్టి సారించి రెవెన్యూ అధికారులు భూ మాయలపై క్షుణంగా పరిశీలను చేయించి, లక్కిశెట్టిగుంట ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


లక్కిశెట్టిగుంట భూమిలో వేసిన ప్లాట్లు

ఉన్నతాధికారులకు రిపోర్టు పంపుతాం



నాయుడుపేటలోని లక్కిశెట్టిగుంటకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తాను. ఆ ప్రభుత్వ భూమికి సంబంధించి రిపోర్టును సైతం ఉన్నతాధికారులకు నివేదించి, చర్యలు చేపడుతాం. – గీతావాణి, తహసీల్దార్, నాయుడుపేట

చర్యలు చర్యలు తీసుకుంటాం



నాయుడుపేటలోని లక్కిశెట్టిగుంట భూమి విషయమై రెవెన్యూ అధికారులకు నివేదించి, పరిశీలన చేయిస్తాం. రెవెన్యూ అధికారులతో సర్వే చేసి ప్రభుత్వ భూమిగా నిర్ధారణ అయితే చర్యలు చేపడుతాం.

– మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి

భద్రత ముఖ్యం..

భక్తులకు రక్షణే లక్ష్యం

శ్రీవారి బ్రహ్మోత్సవం.. విశ్వవాప్త సంబరం.. భక్తులకు పరమానందం.. అందుకే ఆయన ఉత్సవాలకు కొండంత భక్త జనం తరలివస్తోంది. వారిని తిరుమలకు తరలించి.. అక్కడి నుంచి తిరుపతికి తీసుకురావడానికి ఆంధ్రప్రదేశ్ ప్రజారవాణా సంస్థ వందశాతం కండిషన్ ఉన్న బస్సులనే నడుపుతోంది. భక్తుల భద్రత..వారి ప్రాణరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో బ్రహ్మోత్సవాలకు నడపనున్న ఆర్టీసీ బస్సులను ఆరు దశల్లో తనిఖీ చేస్తోంది. వందశాతం కండిషనే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

- బ్రహ్మోత్సవాల బస్సులకు ఆరు దశల్లో పరీక్షలు
- నాలుగు దశల్లో తనిఖీలు పూర్తి
- నేటి నుంచి ఐదో దశ తనిఖీలు


అలిపిరి క్యాంప్ ఆఫీస్‌ను తనిఖీ చేస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వంద శాతం కండిషన్ ఉండే సర్వీసులనే నడపాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రజారవాణా సంస్థ లక్ష్యం. ఈ క్రమంలో బ్రహ్మోత్సవాలకు ఎంపిక చేసిన బస్సు సర్వీసులను ఆరు దశలుగా తనిఖీలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు తొలిదశ తనిఖీలు డిపోలోనే మెకానికి సిబ్బంది, రెండో దశ తనిఖీలు పక్క డిపోలోని మెకానిక్స్, మూడో దశ తనిఖీలు ఓఈఎంఎస్‌తో చేయించారు. నాలుగో దశ తనిఖీలు పొరుగు జిల్లా ఆర్టీసీ మెకానిక్‌లు తనిఖీ చేశారు. ఆదివారం నుంచి అలిపిరి వద్ద తనిఖీలు చేయడానికి క్యాంప్‌ను ఏర్పాటు చేశారు.

నేటి నుంచి ఐదో దశ తనిఖీలు

ఐదో దశ తనిఖీలను అలిపిరిలోని క్యాంప్ ఆఫీస్‌లో ఆదివారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు చేయనున్నారు.ఆ మేరకు శనివారం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి తనిఖీల క్యాంప్ ఆఫీస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా నిబంధనల మేరకు తనిఖీల్లో కచ్చితమైన రిపోర్ట్‌ను ఇవ్వాలని ఆదేశించారు. కండిషన్ వందశాతం బాగుండే బస్సులను మాత్రమే బ్రహ్మోత్సవాలకు ఎంపిక చేయాల్సి ఉందని చెప్పారు. 99 శాతం కండిషన్ బాగున్నా పక్కన పెట్టాలని స్పష్టమైన ఆదేశాలను జారీ చేశారు. జిల్లాలోని 11 డిపోల నుంచి బ్రహ్మోత్సవాలకు ఎంపిక చేసిన 341 సర్వీసులను నిశితంగా తనిఖీలు చేయాలని స్పష్టం చేశారు. కండిషన్ సక్రమంగా లేకుంటే వాటి స్థానంలో మరో సర్వీసును ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈడీతోపాటు తిరుపతి ఆర్టీసీ మెకానిక్ ఇంజినీర్ నరసింహులు ఉన్నారు.

తిరుపతి ఆర్డీఓ పోస్ట్‌కు భలే డిమాండ్

- పోటీలో పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు
- ఒకప్పటి అర్బన్ తహసీల్దార్లు..

తిరుపతి అర్బన్: రాజకీయ కక్షతో కూటమి సర్కార్ తిరుపతి ఆర్డీఓపై శుక్రవారం రాత్రి సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఖాళీగా ఉన్న తిరుపతి ఆర్డీఓ స్థానాన్ని దక్కించుకోవడానికి శనివారం నుంచి భలే డిమాండ్ నెలకొంది. ప్రధానంగా కలెక్టరేట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న అధికారులు ఈ పోస్టును కైవసం చేసుకోవడానికి తీవ్రమైన లాబియింగ్ చేస్తున్నట్లు చర్చసాగుతోంది. ఆ ఇద్దరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సీఎం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు కావడంతో వారికే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు గతంలో తిరుపతి అర్బన్, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, చంద్రగిరి తహసీల్దార్లుగా పనిచేసి ప్రస్తుతం ఇరిగేషన్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా హోదాలో ఉన్న అధికారి అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఆయన తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. అయితే సామాజిక వర్గం ఓకే..అయితే ముడుపుల విషయంలో మాత్రం తగ్గేదేలేదని ప్రజా ప్రతినిధులు స్పష్టం చేయడంతో వేగవంతంగా నగదు సమకూర్చుకునే పనిలో పడ్డారని అంతా అంటున్నారు. అయితే ఈ ముగ్గురులో ఏ అధికారి ముందుగా రూ.2 కోట్లు ఇస్తే వారికే పోస్ట్ దక్కుతుందని బాహాటంగానే అంతా మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో వారిలో ఇద్దరు అధికారులు ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారని అంతా అంటున్నారు. మరో అధికారి ఏకంగా చిన్నబాబు సిఫార్స్‌తో తిరుపతి ఆర్డీఓ కావాలని భావిస్తున్నారు. అవకాశం ఎవరికి దక్కుతుందో సోమవారం వరకు వేచి చూడాల్సి ఉందేనంటున్నారు. కాగా శ్రీకాళహస్తి ఆర్డీ ఓ రవిశంకర్ రెడ్డి ఇన్‌చార్జిగా ఇచ్చారు.

గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్

తిరుపతి లీగల్ : అక్రమంగా గంజాయిని తరలిస్తున్న కేసులో ఇద్దరికీ 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ వాణిశ్రీ శనివారం ఆదేశాలు జారీ చేశారు. అన్నమయ్య జిల్లా, మదనపల్లె మండలం, చిన్న తిప్పసముద్రం సమీపంలోని నల్లగుంటపల్లెకు చెందిన డి. విష్ణువర్ధన్, మదనపల్లె మండలం, చిన్న తిప్పసముద్రం, గంగాపురం వీధికి చెందిన కె మహేష్ రేణిగుంట రైల్వేస్టేషన్ కార్ పార్కింగ్ వద్ద 10 కిలోల గంజాయిని తరలిస్తుండగా రేణిగుంట పోలీసులు వారిద్దరిని అరెస్టు చేశారు. బెంగళూరుకు చెందిన రమేష్ అనే వ్యక్తి గంజాయిని తనకు తెచ్చి ఇవ్వమని కోరడంతో గంజాయిని తరలించినట్టు ఇద్దరు పోలీసుల ఎదుట నేరం అంగీకరించారు. దీంతో రేణిగుంట పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచారు. మూడో నిందితుడు రమేష్‌ను అరెస్ట్ చేయాల్సి ఉంది.

● పెరటాసి.. భక్తసిరి



కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి పుట్టిన మాసం..పెరటాసి.. ఆ నెలలో ఆ భక్తవత్సలుడు పుట్టిన రోజు శనివారం. ఇది భక్తులకు పరమ పవిత్రం.. ఆ దేవదేవుని జన్మనక్షత్రం వచ్చే ఈ మాసంలో తొలి శనివారం ప్రారంభమైన రోజును పురస్కరించుకుని పులకించిన భక్త జనం.. వెరసి కిక్కిరిసిన అలిపిరి పాదాల మండపం.. భక్తుల పూజలు.. హరినామస్మరణలు..కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తులతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. – తిరుపతి